

# నేను వ్రాసిన కొన్ని పద్యాలు కవితలు


## చొప్పకట్ల హరిణి శ్రీధర్

**https://harini.choppakatla.com**

**harini.choppakatla@gmail.com**

## శ్రీశివ దండకం

శ్రీరుద్ర! శ్రీభద్ర! శ్రీభైరవాకార! శ్రీకాళహస్తీశ! శ్రీశైల మల్లేశ! రక్షేశ! త్ర్యక్షేశ! భద్రేశ! చండీశ! పింగాక్ష! కాలాత్మ! భూతాత్మ! సిద్ధాత్మ! విశ్వాత్మ! సూక్ష్మాత్మ! సర్వజ్ఞ! సర్వాంగ సమ్మోహనాకార! శార్దూల చర్మాంబరా! ఈశ! దేవాదిదేవా మహేశా! సురేశా! నటేశా! భవేశా! గిరీశా! కపాలీ! విరూపాక్ష! సద్భక్తితో నిన్ను బూజించి గంగాభిషేకంబులన్ జేసి, పత్రార్చనల్ సల్పి, నైవేద్యమందించి నీపాదసేవందు నిత్యమ్ము నే నిల్వ నందీశ్వరా రార, నన్నేలి నీ బంటుగా నిల్పి నీ దండకం బల్ల నా శక్తిగా నిల్చి, నా యుక్తివై వెల్గి ధర్మాత్మగా సత్య సంధాత్మగా దైవ చింతాత్మగా నిల్పి నన్ బ్రోవుమా కాశివిశ్వేశ్వరా దివ్య భూతేశ్వరా లోకపాలేశ్వరా కాలయోగీశ్వరా చంద్ర మౌళీ నమస్తే నమస్తే నమస్తే నమః!!

ఫలశ్రుతి:

తే: కష్టసమయాన దరిజేరి కరుణతోడ
శ్రీగిరీశుడు దయజూపి చింతదీర్చి
ఆత్మసిద్ధి సంపదొసంగునన్నువు గాను
దండకమ్మును బఠియింప దథ్యముగను!!

## శరన్నవరాత్రి పద్యములు

### గాయత్రీ దేవి

ఆ: వేదవేద్య సకల విద్యలొసంగుచు
జ్ఞానదీపిక వలె నడరునట్టి
కరుణవైన నీవు గాయత్రివై మమ్ము
పావనమొనరింప వందనములు!!

2. గాయత్రీ నామజపము
హాయిగ సలుపగ సతతము హ్లాదము గూర్చున్
సాయమొసంగుచు నిరతము
జేయిని బట్టి వేదమాత చింతలు దీర్చున్!!

3. గాయత్రీ మంత్రమహిమ
వ్రాయుచు బద్యముల రీతి పలుకగ తరమా?
సాయము జేయుము జననీ
మాయను విపులముగ దెల్ప మనుజులకెల్లన్!!

4.

సీ. పంచభూతములను పంచవదనముల
గాగొని నడరెడి కరుణ వీవు
శంఖ, గద, కమల, చక్రమ్ములను గొన్న
చంద్రభూషితవమ్మ సాధ్వి నీవు
పంచమముగ భవ్య పద్మాసనమ్ముపై
వేలచంద్రుల వలె వెలుగులిడుచు
సకలవిద్యల జ్ఞాన సారమొసగుమమ్మ
సాష్టాంగ మొనరించి శరణు వేడ!!

ఆ: కలి విఘాత మందు కలియుగమ్ము నిలచి
శోక! మోహ! దైన్య! శోభలలర
కదలిరమ్ము దేవి గాయత్రివై నీవు
విద్యనొసగి బ్రోవ విబుధతతిని!!

## అన్నపూర్ణ

ఆదిభిక్షువుతో గూడి యార్తితోడ
భక్తజనులెల్ల వేడగా పాహియనుచు
ఆకలిని దీర్చ పాలింప యమ్మవగుచు
అన్నపూర్ణగా రావమ్మ హ్లాదమిడను!!

ఆద్యంతమ్ములు లేకయె
ఆద్యగ సతతము నడరెడి యమ్మవు నీవై
పద్యంబులను లిఖింపగ
ఆధ్యాత్మిక బిక్ష నిడుమ యపురూపముగా!!

జ్ఞానకలశమును బట్టియు
జ్ఞానసుధారసములనిడి జ్ఞాతగ నిలిపిన్
దానము జేయుమ బువ్వము
మానక నినునే దలువగ మంగళవిధమున్!!

కాశీపుర రాణివగుచు
కాశీనాథుడను గూడి కాంతులనిడుచున్
నాశము జేయుచలక్ష్మిని
పాశముతో మమ్ము గాచు పావనమాతా!!

## శ్రీ లలితాత్రిపురసుందరి

సీ: సుహసన సునయన సువదన సురుచిర
సుందర సుమధుర సుముఖి నీవు
పంచబ్రహ్మమయరూపా పద్మసంభవ
రక్షిణీ పద్మినీ రాజరూప
మహితచక్రనిలయా మాతంగకన్యకా
పాశాంకుశధరణీ ప్రణవరూప
హిమవన్నగతనూజ హేరాళ హేవాక
లావణ్య తారుణ్య లలితరూప!!

ఆ: వందనములుగొనుమ వరకరీ శుభకరీ
వందనములుగొనుమ పాపహారి
వందనములుగొనుమ భవభయనాశినీ
వందనములుగొనుమ భక్తవరద!!

## పంచచామరము : ఇందులో నా మొదటి ప్రయత్నము

మహేశ్వరా దిగంబరా యుమామనోభి శేఖరా
సహస్రభాను శోభితా విశాల కీర్తి విగ్రహా
సహాయతన్ నొసంగుమా శ్మశానవాసి భైరవా
వహేలనంబు జేయకన్ సపాలనంబు జేయుమా!!

కృపాకరా దయాకరా ప్రకీర్తి భక్తవత్సలా
కపాలమాలికాధరా వికార దుఃఖభంజకా
అపార కాంతిరూపకా విహార భూత బంధుకా
అపాంగ సింధువై సదా సహాయతన్ నొసంగుమా!!

## వినాయక చవితి (2023) - సీస పద్యం

సీ: విమల విశ్రుత సత్కవిత్వదా!
నీ గుణ భాషణల్ జేతునే భాగ్యమనుచు
భవ్య విశేషణంబగు నీదు చరితమ్ము
పాపసంహారియై ఫలము నిడును
ముజ్జగములనేలు మూషిక వాహనా
విద్యలెల్ల నొసగు విస్తృతముగ
వరద విశద శస్త వక్ర తుండ
సకల సిద్ధుల నిడుమయ్య చిద్విలాస

తే: యజ్ఞ యాగాదుల నొనర్చు విజ్ఞతతులు
సకల కార్యముల్ సలిపెడి సాధుజనులు
తొలుత నీ పూజ జేయుచున్ తలుతు రయ్య
విఘ్నముల నెల్ల బాపుమా విఘ్నరాజ!!

## ఎమ్. ఎస్. సుబ్బులక్ష్మి గారు

భారతీయ కర్ణాటక సంగీత గాయని. భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న అవార్డును పొందిన తొలి సంగీత విద్వాంసురాలు మరియు 1974లో రామన్ మెగసెసే అవార్డును అందుకున్న తొలి భారతీయ సంగీత విద్వాంసురాలు. 1966లో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రదర్శన ఇచ్చిన తొలి భారతీయురాలు. వారి **శత జయంతి సందర్భంగా అందిస్తున్న పద్యాంజలి**.

ఆ: నాకము విడి వెడలి నరజన్మమును బొంది
సుబ్బులక్ష్మి వోలె శోభ గూర్చి
కమ్మనౌ విధంబు కచ్చపి సలిపెను
కీర్తనముల సతత కీర్తితముగ!!

ఆ: దైవకీర్తనమున ధరణియందునడరె
భరతరత్నమనెడి భాగ్యము గొని
పేర్మి జూప బ్రాహ్మి! విద్వాంసురాలిగా
పలు ఘనతలనొందె పటిమ జూపి!!

ఆ: సుప్రభాతమనిన సుబ్బులక్ష్మియె గాద??
శోభ గానమనిన సుబ్బులక్ష్మి
చక్కని గళమనిన చక్కనౌ లక్ష్మియే
మనమునందు మెదులు మరులుగొలిపి!!

ఆ: దివ్యమూర్తులెపుడు దేహము గొనివచ్చి
తలచినట్టి పనిని తగిన రీతి
పొలుపుగా సలుపుచు పూర్ణము జేసియు
అమరముగ నిలచెదరవని యందు!!

ఆ: సుప్రభాతమందు సురుచిర గానమున్
తన్మయమ్మునిడుచు తరళముగను
భక్తిమార్గమందు పరముకు దరిజేర్చు
శోభనమగు శక్తి సుబ్బులక్ష్మి!!

ఆ: మృదుమధుర గళముచె మృత్యువును జయించి
శాశ్వతముగ నిలచె జగతియందు
పరమకీర్తనమున భారతి దరిజేరి
తారవోలెనడరె తరళముగను!!

## ద్వ్యక్షరి

రెండు వ్యంజనాలతో కూర్చిన పద్యమును ద్వ్యక్షరి అంటారు.

తెలుగులో శ్రీనందితిమ్మన గారు పారిజాతాపహరణం నందు ఈ ప్రయత్నము చేసియున్నారు. ఇది నేను చేసిన ప్రయత్నము.

**మన్ననున్నను మనమున మిన్ను నున్న**
**నిన్ను నమ్మి నే మునుమున నీమననము**
**నమనమున నీమముననను నీ నామముననను**
**మననముననను నీ మన్నన మాన నేను!!**

మునుమున= వరుసగా

మననము= చింతన

నమనము= నమ్రత

నీమము= నియమము

భావము:

నేను భూమి పై యున్నప్పటికి, స్వర్గలోక వాసివైన నిన్ను గట్టిగా నమ్ముచూ, నా మనసున ఎప్పుడు నీ స్మరణ చేయడం నమ్రతతో ఒక నియమముగా పాటిస్తూ, నీ నామము స్మరణచేయు ఈ పయనములో సదా నా భక్తితో నిన్ను ఆదరించడం మానను తండ్రీ.

epaper.srujana.net
03 May 2025 - Page 4

## కవితా! ఓ కవితా!

సామాన్య మహిళనై
పలుకలేని గళమునై
తావి లేని పూవునై
నీరు లేని మేఘమై
కరదము లేని శరధినై
ఛందము లేని అందమై
వింత రీతి విశ్వమందు
విహ్వలమున సంచరించు
హరిణి దరిజేరిన హరిణమా
అందమైన స్వప్నమా
చేతనమిడిన శుష్మమా
దివ్యమైన నిరుపమా
భవ్యమైన అనుపమా
మదిని నిలుచు భావనమా
కలము కదుపు పరవశమా
సరస సురస మాధురీ
నవరస మధు ఝురరీ
నాదమై, పద్యమై, గద్యమై
నన్ను జేరిన కవితా
భవ్యమైన భవితా
సాటిలేని మహితా
కవుల ఘన పూజితా
మానస విరాజితా
కవికుల అపరాజితా
నా ఊహలకు నీవే జీవమై
గుండె సవ్వదుల గానమై
తలపుల ప్రతిబింబమై
మలుపుల మధుబింబమై
కలము నుండి చిందు గంగవై
నను నడిపెడి మంగవై
అధరముల దరహాసమై
మధువనిలో మాధవై
మన్నించి నన్నెంచి
కవ్వించి రావించు
కవితా! ఓ కవితా! అందుకొనుమా
సత్రృణతులివియే!!



- హరిణి చొప్పకట్ల



**ఉత్సాహము:**

**1.**

నారసింహ నారసింహ నతులు జేతు పేర్మిగా
కోరి నిన్ను జేర నేను కోర్కె మీఱ కొలుతురా
సారసాక్ష భక్తపోష స్వామి నిన్ను జేర నే
భారమనక నిలుతు సతము పరమపథము నందునే!!

**2.**


నారసింహ నతులు జేయ నయము గూర్చు దేవరా
భరతమాత వగపు దీర్చి భాగ్య మొసగు భూవరా
సారమిడుచు వెన్ను బట్టి సైనికులను నడుపుచూ
వైరిమూక వధను జేయ పరమశక్తి నొసగుమా!!




## 🪷 కాత్యాయినీ అవతారము🪷

శార్దూలము:

శార్దూలోజ్జ్వలవాహినీ! సునయనీ! సౌజన్యసంధాయినీ!
వ్యర్థంబౌ పలు చింతలన్నియువిడన్ భక్తిప్రపత్తిన్ సదా
ర్ధార్థ్యంబుగ మోదమౌ విధమునన్ నీ కైంకర్యముల్ జేసెద
దుర్ధర్షామయ పాపచింతనలనే దూరంబుగా నిల్పుమా!!






శ్రీశ్రీరామనవమి శుభాకాంక్షలతో...

సీ:

శ్రీరామ!శ్రీరామ!సీతామనోభిరామ!
యనుచు దలచెద మంగళముగ
శ్రీరామ!రఘురామ!జితకామ!కులసోమ!
మదియందు నిలిపెద మంగళముగ
శ్రీరామ!గుణధామ!శ్రితపోష!
నీదివ్యమహిమల బలికెద మంగళముగ
శ్రీరామ!సంతతస్మితధామ!
నీసేవ మహిని సలిపెదను
మంగళముగ!!

తే:

మరువక నినునే గీర్తింప వరమునిడుమ
మరువక సలుప జపమును వరమునిడుమ
మరువక సలుప స్మరణమ్ము వరమునిడుమ
మరువక సతము గొలిచెడి వరమునిడుమ!!



సీ:

కాలి యందెలు మ్రోగ కంసహారీ రార
దరిసెన మొసగను తపన హారి
మెరుగు చేలములన్ని మెరువంగ రావయ్య
ధరణీధరా ఘన తామస హర
కంకణమ్ములు మ్రోగ గలగలా యనుచును
కమలనాభా రార కణ్వహారి
పాదుకల్ జేసెడి పరమపావనమైన
సవ్వడిన్ వినిపించ చక్రి రార!!

ఆ:

రార రార యనుచు రమ్యమౌ రీతిని
సతము వేడి నిలువ సత్పథమున
నన్ను బ్రోవ రార నరుల నాథా హరీ
యొకపరి నిను గాంచు యోగమిడుమ!!

సీ:
బాణిని చాపిని పాశిని మోదిని
సర్వవశంకరి సర్వయోని
కవచదేవి విజయా కౌమారి మాహేంద్రి
వైష్ణవి చాముండి వశిని జయిని
సర్వసిద్ధిప్రద చక్రస్వామిని బ్రాహ్మి
త్రిపురమాలిని మహాత్రిపురవాసి
త్రిపురేశి శివదూతి త్రిపురాంబ వారాహి
సర్వమహాంకుశా శరణు శరణు!!

తే:
సర్వజృంభిణి రంజని సర్వబీజ
సర్వసంపత్తి పూరణి సర్వశక్తి
వహ్నివాసిని యోగిని పరమరూప
సర్వమంగళకారిణీ శరణు శరణు!!
తే: (ఫలశ్రుతి)
కవచమైనిల్చు నీ భవ్య ఖడ్గమాల
స్తోత్రనామముల్ పఠియింప శుభములిడుచు
గష్టమంతయు దొలగించి కలిమినొసగి
సర్వశుభములనిడునమ్మ సత్యమిదియె!!

కం:
సర్వాకర్షిణి స్తంభిని
సర్వాధారస్వరూప సర్వేశమయీ
సర్వేప్సిత ఫలదాయిని
సర్వానందమయి విమల షష్ఠీశమయీ!!



వారాహి నవరాత్రుల సందర్భంగా వ్రాసిన సీస పద్యము.

సీ:

మహిషవాహనమున మమ్మేల రావమ్మ వారాహిగా నీవు
వైభవమున

హలము ముసలములన్ హస్తమున్ జేబట్టి దండ నాయిక నిమ్ము
దర్శనమ్ము

పాహి! పాహి! యనుచు పారాయణము జేయ కార్య దక్షత నిమ్ము
కరుణ జూపి

కృష్ణ మేషము వోలె తృష్ణ దీర్చగ రావమ్మ వార్తాళి వై నీవు
వరములిడను!!

తే:

వారణాసిన వెలయుచు నారజముగ
క్షేత్రపాలకురాలవై క్షిప్రముగను
భక్తజనులార్తి దీర్చుచు భాగ్యములిడి
తల్లివై మము బ్రోవుమా తపనహారి!!



సీస పద్యము:

ఆంజనేయ స్తుతి:

అంజనీ మోదమౌ యంగుష్ఠ మాత్రుడు యవధులన్నవి

లేని యనిలజవుడు

సకల విద్యలయందు సామర్థ్యమును జూపు శాస్త్ర ప్రజ్ఞుడు రామచరణ దాసు

కౌండిన్య గోత్రుండు కమనీయ రూపుండు గంధమాదన వాసి కపి ఘనుండు

తలచినంత బలుకు దాశరథికి బంటు సీతజాడను గన్న సిద్ధుడతడు!!

ఆ:

స్థూల సూక్ష్మరూప సుందరదేహుడు

పరమపావన ఘన పవనసుతుడు

యాంజనేయుడనెడి యష్టసిద్ధుల దాత

విమలచరితుడతడు విష్ణుసఖుడు!!



సీ:కలనైన తలచుచు కలవర మందైన
నిలిపెద మాధవా నీదు స్మరణ
ఆప్తుడు నీవని ఆరాధ్య దైవము
నీవని నమ్మితి నీరజాక్ష
రాధా హృదయ వాస యదుకుల భూషణా
శ్రీధరా నగధరా చింత దీర్చి
నీ పద సన్నిధి నిడుమయ్య తాండవ
కృష్ణయ్య దరిజేరు కృపను జూపి!!

తే:భక్త మానస వాసివే పరమ పురుష
ప్రణతులివె నందుకొనుమయ్య పాప హారి
సకల నిగమాల సారమా శాస్త్ర రూప
నీదు చరణంబె శరణంబు నిక్కమిదియె!